

మెడికల్ కళాశాలలో నీటిఎద్దడిని పరిష్కరించాలి

కామారెడ్డిటౌన్, జూన్ 10: కామారెడ్డి మెడికల్ కళాశాలను సోమవారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెడికల్ కళాశాలలో తాగునీటి ఎద్దడిని తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ సుజాతను ఆదేశించారు. మెడికల్ కళాశాల ఆవరణలో ఉద్యానవనం ఏర్పాటుకోసం ప్రతిపాదనలు తయారుచేయాలని సూచించారు. అనంతరం రామేశ్వర్‌పల్లిలో ఉన్న జంతువుల రక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి సింహరావు, అధికారులు సంజయ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బడి బస్సు భద్రమేనా?

- సమీపిస్తున్న విద్యాసంస్థల పునః ప్రారంభ గడువు
- జిల్లాలో 232 ప్రైవేట్ పాఠశాలల బస్సులు
- ప్రతీ యేట అంతంత మాత్రంగానే ఫిట్‌నెట్ పరీక్షలకు హాజరు
- నిబంధనల ప్రకారం ఉంటేనే ఫిట్‌నెస్ అందిస్తామంటున్న రవాణాశాఖ

కామారెడ్డి టౌన్, జూన్ 10: ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ను పెంచుకునేందుకు వివిధ రకాల ప్రయత్నాలు చేస్తున్నాయి. నాణ్యమైన విద్యనందిస్తున్నామని ప్రకటనలు చేస్తూ తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో కార్పొరేట్ స్థాయి విద్య అందకపోవడంతో పిల్లల భవిష్యత్తు దృష్ట్యా తల్లిదండ్రులు పట్టణాల్లో పిల్లలను చదివించేందుకు మొగ్గు చూపుతున్నారు. దీన్నే ఆసరాగా చేసుకున్న ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు వారి గ్రామాల నుంచి పిల్లలను పట్టణంలోని పాఠశాలలకు తీసుకొచ్చేందుకు బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థులను రవాణా చేసినందుకు రవాణా చార్జీలను కూడా వసూలు చేస్తున్నారు. అయితే విద్యాసంస్థల యాజమాన్యాలు రవాణా శాఖ నిబంధనలు పాటించకుండా బస్సులను నడిపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పలుమార్లు విద్యాసంస్థలకు చెందిన బస్సులు ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయి. బస్సు సీట్లకు మించి విద్యార్థులను ఎక్కువగా చేరవేస్తున్నారు. అంతేగాక బస్సుల ఫిట్‌నెస్‌ను డ్రైవర్ కండిషన్‌ను పట్టించుకోవడం లేదు. ఇలాంటి బస్సులపై దృష్టి సారించి పిల్లలకు ఎలాంటి ఆపద ఏర్పడకూడదని ప్రభుత్వం ప్రతీ సంవత్సరం ఫిట్‌నెస్‌కు సంబంధించిన పరీక్షలు చేయాలని నిర్ణయించింది. అందుకుగాను ప్రతీ సంవత్సరం బస్సులకు అందించే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల గడువు మే 15 వరకు ముగిసేట్లుగా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతీ సంవత్సరం అధికారులు బస్సులు ఎంత మేర ఫిట్‌నెస్ ఉందనే దానిపై తనిఖీలు చేస్తూ విద్యాసంస్థల పునఃప్రారంభం వరకు సర్టిఫికెట్లను జారీ చేస్తుంటారు. అందులో భాగంగా ఈ సంవత్సరం కూడా ఫిట్‌నెస్ చర్యల్లో భాగంగా గత నెల 16 నుంచి విద్యాసంస్థల బస్సుల ఫిట్‌నెస్ చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో మొత్తం 232ప్రైవేటు పాఠశాలల బస్సులు ఉండగా.. ఇప్పటివరకు కేవలం 101 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ చేయించుకోవడానికి ముందుకొచ్చినట్లు సమాచారం.

12 నుంచి ప్రారంభం కానున్న పాఠశాలలు

యాజమాన్యాలు తల్లిదండ్రులను ఆకట్టుకునేందుకు పాఠశాల భవనాలకు రంగులు వేస్తూ అడ్మిషన్లు పెంచుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. కానీ విద్యార్థులను తరలించే వాహనాల ఫిట్‌నెస్‌పై మాత్రం దృష్టి పెట్టడం లేదు. మరో రెండు రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కావడం అప్పటిలోగా అన్ని బస్సులకు ఫిట్‌నెస్ పరీక్ష పాస్ నిర్వహించడం అంత ఈజీ కాదు. మరోవైపు కొన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు ఫిట్‌నెస్ పరీక్ష పాస్ కావడానికి వాహనాలకు తాత్కాలికంగా మరమ్మతు నిర్వహించి మమ అనిపించే ప్రయత్నాలు చేస్తున్నాయి. గతేడాది బడి బస్సులకు ఇచ్చిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల గడువు మే 15వ తేదీతో ముగిసింది. ఈ క్రమంలో వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి ఫిట్‌నెస్ పరీక్షలను నిర్వహించాల్సి ఉన్నా ఫిట్‌నెస్ ప్రక్రియ అంతంత మాత్రంగానే ఉంటున్నట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గడువు ముగిసినా పలుచోట్ల విద్యాసంస్థల బస్సులు యథేచ్ఛగా తిరుగుతున్నాయని అధికారులు మాత్రం స్పందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే ఈ సారైన యాజమాన్యాలు పాఠాలు నేర్చుకుంటాయా.. ధనార్జనే ధ్యేయంగా అర్హతలేని బస్సులకు మెరుగులు దిద్ది దర్జాగా తిప్పుతారా!? అన్న సందేహాలు విద్యార్థి సంఘ నాయకుల నుంచి వ్యక్తం అవుతున్నాయి.

ఫిట్‌నెస్ పరీక్షలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న యాజమాన్యాలు

బడిబస్సు ఫిట్‌నెస్ అర్హత సాధించాలంటే అనేక నిబంధనలున్నాయి. కానీ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలకు నీళ్లు వదలుతున్నారన్న ఆరోపణలున్నాయి. పాత బస్సులకు కొత్త రంగులద్ది బస్సులను నడిపిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రవాణా శాఖ నిర్దేశించిన ప్రమాణాలు యాజమాన్యలు పట్టించుకోవడం లేదని విమర్శలు లేకపోలేదు.జిల్లాలో రవాణాశాఖ అధికారిక లెక్కల ప్రకారం 200లకు పైగా బడి బస్సులున్నాయి. అందులో కామారెడ్డి జిల్లా కేంద్రానికి చుట్టు పక్కల ఉన్న మండలాల్లోనే ఎక్కువగా పాఠశాలలు ఉండడం ఫిట్‌నెస్ పరీక్షలు చేయించకుండా గడువు చివరి వరకు వెచ్చి ఉండి గాబరాగా ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాలని చూస్తున్నట్లు సమాచారం. అందుకు ఉదాహరణనే ఆర్‌టీఏ కార్యాలయంలో నమోదు అయిన ఫిట్‌నెస్ బస్సుల సంఖ్య వివరాలే. ఏటా పాఠశాలల పునఃప్రారంభం నాటికి ఫిట్‌నెస్ కోసం బస్సులను రవాణా శాఖ కార్యాలయానికి తీసుకెళ్తున్న విద్యా సంస్థల నిర్వాహకులు వారికి సంబంధించిన ఏజెంట్ల ద్వారానే బడి బస్సును ఫిట్‌నెస్‌కు తీసుకెళ్తున్నారనే విమర్శలు ఉన్నా యి. అయితే నిబంధనల ప్రకారం ఉంటేనే ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు అందిస్తామని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు.

ప్రమాణాలపై అనుమానాలెన్నో..!?

బడి బస్సుల ప్రమాణాలపై ప్రతీ ఏడాది లాగానే.. ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యాజమాన్యాలు ఫిట్‌నెస్ ప్రమాణాలు పాటిస్తున్నాయా? లేదా ఒకవేళ ఫిట్‌నెస్ లేకపోయినా అధికారులు చూసీచూడనట్లుగా వదిలేసి వాటికి గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారా? అనే ప్రశ్నలు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘ నాయకుల నుంచి ఉత్పన్నమవుతున్నాయి. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు సరిగా లేని బస్సులకు చిన్నచిన్న మరమ్మతులు చేసి రంగులు వేసి తాత్కాలిక ఏర్పాట్లు చేసి ఫిట్‌నెస్ పరీక్షలకు పంపుతున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరో రెండు రోజుల్లో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటి వరకు ఫిట్‌నెస్ పరీక్షలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించని అధికారులు హడావుడిగా ఆ ప్రక్రియను పూర్తిచేసే అవకాశం ఉందని, ఈ పరీక్షలు తూతూ మంత్రంగా సాగుతాయని పలువురు పేర్కొంటున్నారు. బస్సులు ప్రమాదాలకు గురవుతుండడంతో వాటి ప్రమాణాలపై అధికారులు పకడ్బందీగా వ్యవహరించాల్సిందేనని విద్యార్థి సంఘాల నాయకులు, తల్లిదండ్రులు స్పష్టం చేస్తున్నారు.

ఫిట్‌నెస్ నిబంధనలు ఇలా..

- బస్సుకు నాలుగు వైపుల పైభాగం మూలల్లో బయటివైపు గాఢ పసుపు పచ్చని రంగు గల ప్లాషింగ్ లైటు అమర్చాలి. విద్యార్థులు బస్సు నుంచి ఎక్కేటప్పుడు.. దిగేటప్పుడు, ఈ లైట్లను వెలిగించాలి.
- బస్సు ముందు భాగంలో 400 ఎంఎం సైజు బోర్డును పాఠశాల పేరుతో రాయించి అమర్చాలి. ఈ బోర్డుపై 250 ఎంఎంలకు తగ్గకుండా ఇద్దరు పాఠశాల విద్యార్థుల బొమ్మలను నల్లరంగులో చిత్రీకరించాలి. ఈ చిత్రం కింద స్కూల్ బస్సు అని నల్లరంగులో కనీసం 100 ఎంఎం అక్షరాలతో రాయాలి.
- ప్రతీ విద్యా సంస్థ సీటింగ్ కెపాసిటీ కన్నా ఎక్కువగా విద్యార్థులను తీసుకొని వెళ్లరాదు.
- ప్రతీ విద్యాసంస్థ యాజమాన్యం, ట్రాన్స్‌పోర్టు శాఖ, పోలిసుశాఖ, విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సంవత్సరానికి ఒకరోజు రోడ్ సేఫ్టీ తరగతులు నిర్వహించాలి.
- బస్సు ఫుట్‌బోర్డుపై మొదటి మెట్టు నుంచి 325 ఎంఎం ఎత్తుకు మించరాదు. అన్ని మెట్లు జారకుండా ఉండే లోహాలతో అమర్చాలి.
- బడి బస్సును నడిపే డ్రైవర్ వయస్సు 60 సంవత్సరాలు మించరాదు. బస్సు డ్రైవర్ పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలి.
- డ్రైవర్‌కు హెవీ లైసెన్స్‌తో పాటు ఐదేళ్ల అనుభవం ఉండాలి. ఆరోగ్య పరిస్థితిని మూడు నెలలకు ఒకసారి యాజమాన్యమే చెక్ చేయించాలి.
- బస్సులో ప్రథమ చికిత్స బాక్స్ తప్పనిసరిగా ఉండాలి.





‘ప్రజావాణి’ వినతులను తక్షణమే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



‘ప్రజావాణి’లో దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్



‘ప్రజావాణి’లో పాల్గొన్న అధికారులు

కామారెడ్డిటౌన్, జూన్ 10: ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన వినతులను జాప్యం లేకుండా తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 50 వినతులు వచ్చినట్లు తెలిపారు. ఇందులో రెవెన్యూ 33, వ్యవ సాయం 5, సివిల్‌సప్లయ్ 2, మున్సిపల్ 4, సర్వేల్యాండ్ 2,విద్యాశాఖ 1, గ్రామ పంచాయతీ 2, గిరిజన సంక్షేమ శాఖ 1 వినతులు వచ్చాయని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలు చెబితే జిల్లాస్థాయి అధికారుల దృష్టికి వెళ్లి త్వరగా పరిష్కారం అవుతాయని ప్రజలు వస్తారని అన్నారు. ఆ దరఖాస్తులను వెనువెంటనే పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టిపెట్టారని ఇక్కడ పరిష్కారం కాకపోతే ప్రజాభవన్‌కు ప్రజలు వెళ్తున్నారని అన్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో నిర్వహించే ప్రజావాణిలో జిల్లాకు సం బంధించి 391 వినతులు సీఎంఓ కార్యాలయం నుంచి జిల్లాకు పంపారని తెలిపారు. వాటిని సంబంధిత శాఖలు అత్యంత ప్రాధాన్యత నిచ్చి ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించి పరిష్కరించాలన్నారు. దరఖాస్తు తిరస్కరణ లేదా పరిష్కరించక పోవడానికి సహేతుకమైన కారణాలుంటే ఫిర్యాదుదారునికి సకాలంలో తెలపాలని ఎట్టిపరిస్థితుల్లో తమ వద్ద అనవసరంగా పెండింగ్‌లో పెట్టుకో వద్దని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ చందర్‌నాయక్, జిల్లా అధికారులు రాజారాం, రాజు, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి పరీక్షలకు మంగళం



మట్టి పరీక్షల నిమిత్తం శాంపిళ్లను సేకరిస్తున్న దృశ్యం (ఫైల్)

కామారెడ్డి టౌన్, జూన్ 10: పంటల సాగులో భూసార పరీక్షలు ముఖ్య భూమిక పోషిస్తాయి. ప్రతీ ఏటా యాసంగి, వానాకాలం కోతలు ముగిసి, సాగు పనులు ప్రారంభించే నెలరోజుల ముందు ఈ పరీక్షలు చేస్తారు. భూమిలో సహజంగా ఉన్న పోషకపదార్థాల లెక్కలు తీసి పరీక్షల్లో వచ్చిన రిపోర్టు ఆధారంగా వ్యవసాయాధికారుల సూచనల మేరకు రైతులు పంటలు సాగు చేస్తారు. దీంతో రసాయనిక, సేంద్రియ ఎరువుల వినియోగంలో అదనపు ఖర్చు తగ్గి, దిగుబడులు పెంచుకునే అవకాశం ఉంటుంది. నేల భూసారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవడం రైతులకు అవసరం. దీంతో ఎరువుల వాడకాన్ని తగ్గించి, దిగుబడులను పెంచడంలో ప్రధాన పాత్ర వహిస్తోంది. ఇంతటి ప్రాముఖ్యం ఉన్న నేల పరీక్షలను చేయడంలో స్పందన కరువైంది.

కానరాని మట్టి పరీక్షలు

రైతుపై అదనపు భారాన్ని తగ్గించేందుకు గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన త ర్వాత భూసార పరీక్షలపై ప్రత్యేక దృష్టి సారించిం ది. ప్రతీ రైతు పొలం వద్ద కు వెళ్లి, మట్టి నమూనాలను సేకరించి, పరీక్షలు చేసేవిధంగా అవసరమైన పరికరాలను సైతం అందించింది. 2016 నుంచి 2020 వరకు క్రమం తప్పకుండా మట్టి పరీక్షలు నిర్వహించిన గత ప్రభుత్వం గత మూడేళ్ల క్రితం నుంచి ఎలాంటి పరీక్షలు చేపట్టలేదు. ప్రస్తుత ప్రభుత్వం సైతం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు. దీంతో రైతులు ఎవరికి నచ్చిన విధంగా వారు పంటలు సాగు చేస్తున్నారు. చీడపీడల నివారణ, మొక్కకు పోషకాల పేరిట ఎడాపెడా సేంద్రియ, రసాయనిక ఎరువులను చల్లుతూ ఎక్కువ ఖర్చు చేస్తు నష్టపోయారు.

- రైతువేదికల్లో మూలనపడిన పరికరాలు
- తూతూ మంత్రంగా మట్టి పరీక్షలు
- కొన్ని మండలాల్లో పరీక్షలకు వెనుకాడుతున్న అధికారులు
- నేల స్వభావం తెలియక పంటల సాగు
- మోతాదు కంటే ఎక్కువ ఎరువుల వినియోగం
- దిగుబడి రాక నష్టాల పాలవుతున్న అన్నదాతలు

ఇప్పటి వరకు పదుల సంఖ్యలోనే శాంపిళ్ల సేకరణ

భూసార పరీక్షలు నిర్వహించి, వాటి ఆధారంగా ఏఏ పంటలు సాగు చేయాలి. ఎంత మోతాదులో ఎరువులు చల్లాలనే దానిపై అవగాహన కల్పించాల్సి ఉంటుంది. మృగశిరకార్తె ప్రవేశించి, వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న 24 మండలాల్లో భూసార పరీక్షలు ఒకటి, రెండు మండలాల్లో తప్ప ఎక్కడా పత్తాలేవు. ఇప్పటికే తొలకరి పలకరించగా ఇప్పటి వరకు శాంపిళ్లు అంతంత మాత్రమే సేకరిస్తున్నారు. దీంతో రైతుకు నచ్చిన విధంగా పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నాడు. ప్రతీ ఏటా వేసిన పంటనే వేయడంతో భూసారం తగ్గి దిగుబడి రాక చేసిన అప్పులతో తల్లడిల్లుతున్నాడు. రైతులకు సరైన సమయంలో సలహాలు, సూచనలు అందించడంతో పాటు పంట దిగుబడిలో మెలకువలు చెప్పడంతో పాటు భూసార పరీక్షలు చేపట్టేలా చూడాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది.



తగ్గుతున్న ఎస్సారెస్పీ నీటినిల్వ సామర్థ్యం

- ప్రాజెక్టులో తగ్గిపోతున్న నీటి నిలువలు
- ఇసుక, మట్టి చేరడంతో తగ్గిన 31.5 టీఎంసీలు
- అధికారికంగా ఎస్సారెస్పీ నీటి నిలువ సామర్థ్యం 80.5 టీఎంసీలేనని ప్రకటన

నిజామాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రీరాంసాగర్ నీటి నిలువ సామర్థ్యం తగ్గిపోయింది. ఈ మేరకు ఇంజనీరింగ్ అధికారులు నిర్ధారించారు. సర్వే రిపోర్టు ఆధారంగా నీటి నిలువ సామర్థ్యాన్ని ప్రకటించారు. గడిచిన నలభై ఏళ్లలో 32 టీఎంసీల నీటి నిలువ సామర్థ్యం తగ్గిపోయిందని ప్రకటించారు. అధికారికంగా ఇంజనీరింగ్ చీఫ్ ఉత్తర్వులు జారీ చేయడంతో ప్రస్తుత సామర్థ్యాన్ని నిర్ధారిస్తున్నారు. ప్రాజెక్టులో ఇక 80 టీఎంసీల నీటి నిలువ సామర్థ్యమే ఉందని ప్రకటించారు.

1963లో ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని 1963లో చేపట్టారు. ప్రాజెక్టును 1983లో నిర్మాణం పూర్తి చేసి జాతికి అంకితం చేశారు. అప్పటి నుంచి ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టుకు సాగునీటిని అందిస్తున్నారు. కాకతీయ, సరస్వతి, లక్ష్మి, గుత్ప అలిసాగర్ ఎత్తిపోతలతో పాటు ఇతర ఎత్తిపోతల పథకాల కింద ఆయకట్టుకు సాగునీటిని అందిస్తున్నారు. నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, జగిత్యాల, కామారెడ్డి జిల్లాలకు తాగునీటిని కూడా ఇస్తున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి 1983లో ప్రజలకు అంకితం చేయగా 1994లో ఇంజనీరింగ్ అధికారులు సర్వే చేపట్టారు. పూర్తిస్థాయి నీటి సామర్థ్యాన్ని పరిశీలించారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన పదేళ్లలోనే 21 టీఎంసీల వరకు మట్టి పేరుకుపోయిందని నిర్ధారించారు. ప్రాజెక్టు సామర్థ్యాన్ని 91 టీఎంసీలుగా ప్రకటించారు. ఆ తర్వాత 2014లో ఒకదఫా ఇంజనీరింగ్ అధికారులు సర్వే చేశారు. గత సంవత్సరం అప్పటి ప్రభుత్వం మద్రాస్‌కు చెందిన సెకాన్ కంపెనీకి అప్పచెప్పింది. ఆ కంపెనీ అధికారులు గత సంవత్సరం వానాకాలంలో ప్రాజెక్టు నిండుగా ఉన్నప్పుడు సర్వే చేశారు. పూర్తిగా పరిశీలించారు. సర్వే నివేదికను రాష్ట్ర ఇంజనీరింగ్ అధికారులకు అందించారు. ప్రాజెక్టులో ఇసుక, మట్టి ఎక్కువగా చేరడం వల్ల నీటి నిలువ సామర్థ్యం తగ్గిపోయిందని నిర్ధారించారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.5 టీఎంసీలే నీటి నిలువ ఉన్నట్లు గుర్తించారు. ఆ నివేదిక ప్రభుత్వానికి ఇవ్వడంతో ఈ జూన్ నెలలోనే రాష్ట్ర ఇంజనీరింగ్ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. సాగునీటి శాఖ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్ నిర్ణయం తీసుకొని అధికారికంగా ప్రకటించారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.5 టీఎంసీల నీటి నిలువ సామర్థ్యం ఉందని తెలిపారు. అప్పటి నుంచి ఎస్సారెస్పీ అధికారులు అధికారికంగా 80.5 టీఎంసీలు అని ప్రకటించారు. ప్రాజెక్టు కట్టిన ఈ నలభై ఏళ్లలో సుమారు 31.5 టీఎంసీల మేర మట్టి నిల్వలు పూడుకుపోవడం వల్ల నీటి నిలువ సామర్థ్యం తగ్గిపోయింది. ఆ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఈ నిలువ సామర్థ్యాన్ని ప్రకటించామని ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్‌రావు గుప్త, ఈఈ చక్రపాణి, ఏఈ వంశీలు తెలిపారు. ప్రాజెక్టులో ఉన్న పరిస్థితులను బట్టి ప్రస్తుతం 80.5 టీఎంసీలే నీటి నిలువ సామర్థ్యం ఉందని వారు తెలిపారు.

'పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి'



వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

పెద్ద కొడప్గల్, జూన్ 10:జుక్కల్ మండలంలోని ఆయా గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సురేష్ గొండ మాట్లాడుతూ.. మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలలో కార్మికులుగా పనిచేస్తున్న వారికి గత 8 నెలలుగా వేతనాలు అందడం లేదని, దీంతో కార్మికులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికే చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న కార్మికులకు 8 నెలలుగా వేతనాలు అందకపోవడంతో కుటుంబపోషణ మరింతకష్టంగా మారిందని తెలిపారు. 51వ జీవో సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దుచేయాలని, కార్మికులకు ఇన్సూరెన్స్ చేసి పాత విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. దీంతో పాటుగానే కారోబార్, బిల్ కలెక్టర్ల ప్రత్యేక స్టేటస్ ఇవ్వాలని, జీవో 60 ప్రకారం పంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశా రు. దీంతో పాటుగానే కార్మికులకు రూ.5 లక్షల ఇన్సూరెన్స్ విధానానికి సంబంధించిన విధివిధానాలు అమలుచేయాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్ర మంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ మండల అధ్యక్షులు గోవింద్, కార్మికులు ఈరయ్య, గంగారాం, సాయిలు, మారుతి పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీ

ముప్కాల్, జూన్10:బాల్కొండ సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం స్కూల్ యూనిఫామ్‌లను బాల్కొండ ఎంఈవో బట్టు రాజేశ్వర్ ఉపాధ్యాయులకు అందజేశారు. ఒక్కో యూనిఫామ్‌కు రూ.70 చొప్పున సమాఖ్య సంఘాల ద్వారా విద్యార్థుల యూనిఫామ్‌లను కుట్టించి అందజేస్తున్నట్లు ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఈవో విజయభాస్కర్‌రెడ్డి, సమాఖ్య ఏపీఎం, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులను కలిసిన అర్బన్ ఎమ్మెల్యే


శుభాకాంక్షలు తెలుపుతున్న అర్బన్ ఎమ్మెల్యే

పెద్దబజార్, జూన్ 10: ప్రమాణ స్వీకారం చేసిన కేంద్ర మంత్రులను సోమవారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సామాన్య కార్యకర్తల నుంచి అంచెలంచెలుగా ఎదిగి కేంద్ర క్యాబినెట్‌లో మంత్రులుగా ప్రమా ణ స్వీకారం చేసిన గంగాపురం కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్‌లను తెలంగాణ పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజల తరపున హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

ముప్కాల్, జూన్10: వానాకాలంలో సీజన్‌లో రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠినచర్యలు తప్పవని బాల్కొండ వ్యసాయ విస్తీర్ణ అధికారిణి రేష్మ అన్నారు. సోమవారం బాల్కొండ మండల పరిధిలో నాగాపూర్ గ్రామంలో ఖరీఫ్ సాగుకు రైతులకు అవగాహన కల్పించారు. గ్రామాలలో లూజ్‌విత్తనాలు అమ్మితే వారిపై చట్ట రీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నెలలో సరైన తేమ ఉన్నప్పుడు విత్తుకుంటేనే మొలక శాతం అందుతుందని తెలిపారు. బరువైన నెలలో 70 మిల్లీమీటర్ తేలికపాటి నేలలో 60శాతం వర్షం పడితేనే విత్తనాలు విత్తుకోవాలని రైతులకు వివరించారు. లైసెన్స్ కలిగిన డీలర్‌షాప్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, రశీదు తప్పనిసరి తీసుకొని పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలని అన్నారు.

రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవాలి

వ్యవసాయాధికారుల సూచన

మద్నూర్, జూన్ 10: వానాకాలం సీజన్ ప్రారంభమైందని, రైతులు మేలురకంతో అధిక దిగుబడులు సాధించాలని, నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని, నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. పంటల సాగులో మేలైన విత్తనాలు ఎంపిక చేసుకోవడం ఎంతో ప్రధానం, కాని తరచూ నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతూనే ఉన్నారు. పలు ప్రయివేట్ విత్తన కంపెనీలు ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో నకిలీ లేబుల్‌తో రైతులను మోసం చేస్తున్నాయి. ఇటువంటి విత్తనాల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకుని నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసి దిగుబడి సాధించాలని మండల వ్యవసాయ అధికారి రాజు సూచించారు.

● విత్తనోత్పత్తి....

మేలు రకం విత్తనాలను రైతులు కూడా ఉత్పత్తి చేసుకోవచ్చు. మంచి విత్తనం అంటే శుభ్రత, నాణ్యతతో పాటు బాగా మొలకెత్తే స్వభావం ఉండాలి. ప్రతి రైతు తనకు తానే నాణ్యమైన విత్తనాలను తయారు చేసుకుంటే తక్కువ ఖర్చు తో ఎక్కువ దిగుబడి పొందవచ్చు. పరిశోధన సంస్థల్లో వ్యవసాయ శాస్త్రవేత్తల పర్యవేక్షణలో రూపొం దించే బ్రీడర్ విత్తనం నుంచి ఫౌండేషన్ విత్తనాన్ని ఉత్పత్తి చేస్తారు. ఫౌండేషన్ విత్తనాల నుంచి సర్టిఫైడ్ విత్తనాలు ఉత్పత్తి అవుతాయి. రైతులు ఈ విత్తనాలనే వాడాల్సి ఉంటుంది. సర్టిఫైడ్ సీడ్స్ జన్యుపరంగా మంచి లక్షణాలుంటాయి. మొలకశాతం ఎక్కు వగా ఉంటుంది. రోగకారకమైన శిలీం ద్రాల బెడద ఉండదు. అలాంటి విత్తనా లతో పం డించిన పంటల నుంచి విత్తన ఉత్పత్తి చేసుకుని పంటలు సాగుచేస్తే అధిక దిగు బడులు సాధించవచ్చు.


దుక్కులు చేస్తున్న రైతన్న

● రైతు కల్తీ కనిపెట్టకుంటే అంతే మరి..

రైతులు ధర తక్కువగా ఉండే పురుగు మందులు, రసాయన ఎరువులు ఎక్కువ ధర ఉండే కంపెనీల పేరుతో వ్యాపారులు విక్రయిస్తుంటారు. చలామణిలో ఉన్న ఎరువులు, మందులను పోలి ఉండే నకిలీలను విక్రయిస్తూ ఉంటారు. తేమ ఉన్న గడ్డ కట్టిన వాటిలో నాణ్యత ప్రమాణాలు లోపిస్తాయి. గుళికలన్నీ ఒకే రంగులో ఉంటాయి. అన్య పదార్థం ఎరువులో కనిపిస్తే దాన్ని కల్తీగా గుర్తించాలి. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే రైతు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయగలుగుతారు.

ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకోండి

● కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి
● అధికారులు, మిల్లర్లతో సమీక్షా సమావేశం
● పాల్గొన్న కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వీ.పాటిల్


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

కామారెడ్డిటౌన్, జూన్ 10: వర్షాకాలం సాగుకు రైతులకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో కామారెడ్డి నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు పూర్తి, 2024-25 ఖరీఫ్‌సీజన్‌కు ముందస్తుగా చేపట్టవలసిన కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్, అధికారులు, మిల్లర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద, రైస్‌మిల్లుల వద్ద వివిధ కారణాలతో తరుగు తీస్తున్నారని, ఇది కరెక్ట్ కాదని అధికారులు, మిల్లర్లు ఒక్క పద్దతి ప్రకారం వెళ్లాలని హెచ్చరించారు. అధికారులు, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు , మిల్లర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. తరుగు సమస్య వచ్చే సీజన్లకు పునరావృతం కావద్దన్నారు. రైతుల పట్ల మానవతా దృక్పథంలో వ్యవహరించాలని, ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ప్యాడీ క్లీనర్లు, డ్రైయింగ్ మిషన్లు, జాలీ మిషన్లు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు వర్షకాలం సాగులో భాగంగా సకాలంలో నాట్లు వేసుకునేలా వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నకిలీ విత్తనాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నకిలీ, కాలం చెల్లిన విత్తనాలను విక్రయించే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రబీ సీజన్ లో జిల్లాలో 350కేంద్రాలను ఏర్పాటు చేసి 3,27,631మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో 85 కేంద్రాల ద్వారా 93వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. అకాల వర్షాల కారణంగా పాత సీజన్లకు సంబంధించి ధాన్యం పేరుకుపోయి అన్‌లోడ్ చేయడానికి స్థలం లేక కాస్త ఇబ్బందులు పడ్డ మిల్లర్లు ఓపెన్ స్థలాల్లో ధాన్యాన్ని దించుకున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మల్లిఖార్జున్ బాబు, జిల్లా మేనేజర్ నిత్యానందం, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య, ఎఫ్‌సీఐ డివిజినల్ మేనేజర్ ప్రకాష్, డీపీఎం భాగ్యలక్ష్మీ, జిల్లా సహకార అధికారి శ్రీనివాస్, మిల్లర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మరమ్మతుకు నోచుకోని అలుగు


ధ్వంసమైన కొండాపూర్ ఊర చెరువు అలుగు

సిరికొండ, జూన్ 10: వర్షాకాలం సమీపించినా ధ్వంసమైన అలుగును మరమ్మతు చేయించడంలో నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. సిరికొండ మండలం కొండాపూర్ గ్రామ సమీపాన గల ఊర చెరువు మరమ్మతుకు 2015లో టీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం మొదటి విడతలో రూ.46 లక్షల నిధులు మంజూరు చేసింది. చెరువు కట్ట బలోపేతం చేయడంతో పాటు తూములు, అలుగును మరమ్మతు చేశారు. పూడిక తీత పనులు కూడా చేశారు. అదే ఏడాది కురిసిన భారీ వర్షాలకు చెరువులోకి వరద నీళ్ల అధికంగా రావడంతో అలుగు ఒప్పొంగి ప్రవహించింది. వరద ప్రవాహానికి అలుగు సిమెంటు గోడ కింద మట్టికొట్టుకపోయి అలుగు ధ్వంసమైంది. అప్పటి నుంచి ప్రతి ఏడాది వరద ప్రవాహానికి సిమెంటుతో చేసిన గోడలు నీటిలో కలిసిపోతున్నా నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోవడమే మానివేశారు. ఇలాగే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రానురాను సిమెంటు గోడల కింద గల మట్టి పోయి చెరువుకు ప్రమాదం ఏర్పడుతుందని స్థానికులు చెబుతున్నారు. వరద ప్రవాహానికి కాలువ వెడల్పుగా మారి చెరువు కట్టపైకి వెళ్లే దారి లేకుండా పోతుందని రైతులు చెబుతున్నారు. చెరువుకు ప్రమాదం ముంచక ముందే అధికారులు తేరుకుని అలుగు మరమ్మతు పనులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

రూ.30 లక్షలతో ప్రతిపాదనలు పంపించాం

● ఏఈ సాయినాథ్

ఊరచెరువు అలుగు మరమ్మతు కోసం రూ.30లక్షలతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి ఏడాదిన్నర క్రితమే పంపించామని నీటిపారుదల శాఖ ఏఈ సాయినాథ్ చెప్పారు. దెబ్బతిన్న అలుగును ఎస్.ఈ, ఈఈలు కూడా వచ్చి పరిశీలించారని ఆయన చెప్పారు. ఆమోదం రాగానే మరమ్మతు పనులు చేపడుతామని ఏఈ చెప్పారు.

కొనసాగిన ఉపాధ్యాయుల ధృవపత్రాల పరిశీలన

నిజామాబాద్ అర్బన్, జూన్ 10: పదోన్నతులు, పండిత పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్ కొరకు సీనియారిటీ జాబితాకు అనుగుణంగా సోమవారం లాంగ్వేజ్ పండిట్ తెలుగు, హిందీ, ఉర్దూ, పీఈటీ ఉపాధ్యాయుల ధృవపత్రాల పరిశీలన సాగింది. విద్యాశాఖ కార్యాలయానికి రావడంతో కార్యాలయం ఉపాధ్యాయులతో కిటకిటలాడింది. విద్యాశాఖ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో గతంలో నిలిచిపోయిన పండిత్, పీఈటీల అప్‌గ్రేడేషన్‌తో పాటు ఎస్‌జీటీల పదోన్నతులను కూడా నిర్వహిస్తుంది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితాను పొందుపర్చిన అధికారులు ఉపాధ్యాయుల సీనియారిటీ సీరియల్ నెంబర్ ప్రకారం సోమవారం కొంత మంది ధృవీకరణ పత్రాలను పరిశీలించగా మంగళవారం మరి కొంత మంది లాంగ్వేజ్ పండిత్‌ల ధృవపత్రాలను పరిశీలించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ తెలిపారు.

పోలీసు శాఖలో బదిలీలకు రంగం సిద్ధం!

ఖిల్లా, జూన్ 10:పోలీస్ శాఖలో ఎస్సై, సీఐల బదిలీలకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల క్రమంలో మల్టీజోన్‌లో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న సీఐలు, ఎస్సైలు, ఎన్నికల నిబంధనల్లో భాగంగా జిల్లాకు బదిలీపై వచ్చిన సిబ్బంది ఎన్నికలు ముగియడంతో తాము వచ్చిన ప్రాంతాలకు తిరిగి బదిలీపై వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. మరికొందరు రెండేళ్లుగా ఇక్కడ పనిచేస్తున్న వారు సైతం బదిలీపై వెళ్లిపోవాలని తమకు తెలిసిన ప్రజాప్రతినిధులను ఆశ్రయిస్తున్నట్లు తెలిసింది. ఈనెల 4వ తేదీ నుంచి పోలీస్ శాఖలో జోరుగా ప్రచారాలు జరుగుతున్నట్లు సమాచారం. ఇది పోలీసు వర్గాల్లో చర్చనీయాంశమైంది.

సానిటేషన్ పనులను పరిశీలించిన చైర్‌పర్సన్


సానిటేషన్ పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

ఆర్మూర్‌టౌన్ , జూన్10: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్, మామిడిపల్లిలో సానిటేషన్ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్ పరిశీలించారు. సానిటేషన్ స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా పెర్కిట్‌లోని 20వార్డు, మామిడిపల్లిలో 24వార్డులో పనులను ఆమె పరిశీలించి డ్రైనేజీలలో ఎలాంటి చెత్తాచెదరం లేకుండా చూడాలని మున్సిపల్ కార్మికులకు తెలిపారు. రాబోయే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రభలకుండా, నీరు నిల్వకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆమె వివరించారు. ఆమె వెంట వైస్‌చైర్మన్ షేక్ మున్న, కౌన్సిలర్ ఆకుల రాము, మున్సిపల్ కమిషనర్ రాజు, సానిటరి ఇన్‌స్పెక్టర్ మహేష్, మున్సిపల్ అధికారులున్నారు.

మానవతాసదన్ చిన్నారులకు పుస్తకాల పంపిణీ


మానవతా సదన్ చిన్నారులతో అలుక కిషన్

డిచ్‌పల్లి,జూన్ 10: మానవత సదన్ చిన్నారులకు టీఎన్‌జీవో అధ్యక్షుడు కిషన్ ఉచితంగా పుస్తకాలు, పరీక్ష ప్యాడులు పంపిణీ చేశారు. మానవతాసదన్ విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థానాల్లో రాణించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





సమాచార చట్టం వజ్రాయుధం


బోధన్‌లో సమాచారం చట్టం అవగాహన సదస్సులో మాట్లాడుతున్న దృశ్యం

పెద్దబజార్, జూన్ 10: చట్టం పేదవాడికి వజ్రాయుధం లాంటిదని సమాచార హక్కు చట్టం, పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ సలీమ్ అన్నారు. సోమవారం నగరంలోని సమాచార హక్కు చట్టం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని చాలా వరకు ప్రభుత్వ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం 2005 బోర్డులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు ప్రజలు కోరిన సమాచారాన్ని 30 రోజుల్లో సంబంధిత శాఖ వారిచే సమాచారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు ఆదె ప్రవీణ్ మాట్లాడుతూ సెక్షన్ 6 (1) ప్రకారంగా ప్రతి భారత పౌరుడికి కావాల్సిన సమాచారాన్ని సంబంధిత అధికారులచే ఉచితంగా పొందవచ్చని ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల శేఖర్ పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: సమాచార హక్కు చట్టంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సమాచార హక్కు చట్టం రాష్ట్ర డైరెక్టర్, మాజీ న్యాయమూర్తి ఎంఏ సలీం అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని ఇరిగేషన్ గెస్ట్‌హౌస్‌లో సమాచార హక్కు చట్టం-2005పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005 అక్టోబర్ 12న ఈ మహత్తరమైన చట్టం వచ్చిందని ప్రజలకు ఈ చట్టంపై తప్పకుండా అవగాహన కలిగిఉండాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం బోర్డు ఏర్పాటు చేసి ప్రజలు కోరిన సమాచారాన్ని అందించాలన్నారు. అధికారులు ప్రజలు అడిగిన సమాచారాన్ని ఇవ్వనట్లయితే రాష్ట్ర కమిషన్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. సమాచార హక్కు చట్టం గురించి అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేయాలని కోరారు. కార్యక్రమంలో బోధన్ డివిజన్ అధ్యక్షులు మహమ్మద్ ఫర్వేజ్ ఖదీర్, కార్యదర్శి సయ్యద్ మౌలానా, ఉపాధ్యక్షులు మహమ్మద్ షరీఫ్, ప్రతినిధులు ఎండీ.నయాఉద్దీన్, నర్సింలు, రాజు, శ్రీనివాస్, మహ్మద్, వాజీద్, ఎండీ అక్తర్, షేక్.జావీద్, ఎండీ అహ్మద్, మొసిన్, అహ్మద్ అయుబ్, తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలిని మార్చడంలో భాగస్వాములు కావాలి

ఉద్యోగులకు డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం రాథోడ్ సూచన


పత్రాలు అందజేస్తున్న అధికారి

పెద్దబజార్, జూన్ 10: ప్రజల జీవనశైలిని మార్చడంలో భాగస్వాములు కావాలని డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం రాథోడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లలో ఖాళీలను ఎంఎల్‌హెచ్‌పీల ద్వారా నియామకం చేయడంలో భాగంగా డీఎంహెచ్‌వోకు నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం ఎంఎల్‌హెచ్‌పీలు 46 మంది అభ్యర్థులకు పోస్టింగ్‌లు ఇవ్వడం జరిగిందన్నారు. ఇటీవల ఎన్నికల కోడ్ కారణంగా నియామకాల పత్రాలు అందజేయడంలో ఆలస్యమైనందున ఎన్నికల కోడ్ ముగిసినందున జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం అర్హులందరికీ నియామకపత్రం అందజేశామని తెలిపారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో కీలకంగా వ్యవహరిస్తూ గ్రామీణ ప్రజల ఆరోగ్యాన్ని పెంపొందించాలని అన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం పెంపొందించాలని తెలిపారు. ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏవో చందర్, డాక్టర్ వెంకటేశ్, సూపరింటెండెంట్ వినయ్ కుమార్, డీహెచ్‌ఈ ఘన్పూర్ వెంకటేశ్వర్లు, హెచ్‌ఈవో నాగరాజు, జూనియర్ అసిస్టెంట్ ఫారాన, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

వర్ని,జూన్10:వర్ని మండల కేంద్రంలోని సీసీడీ ఆవరణలో సోమవారం 300మంది నిరుపేదలకు ఉచితంగా నిత్యవసర సరుకులను అందజేశారు. మాదాల చారిటబుల్ ట్రస్టు వారి సహకారంతో పప్పులు, చక్కెర, సబ్బులు, చాయ్‌పత్తి వంటి సరుకులను అందజేశారు. ఒక్కొక్కరికి రూ.500 విలువ గల సరుకులను అందజేసినట్లు సీసీడీ మేనేజర్ ఠాగూర్ తెలిపారు. సరుకుల పంపిణీ పట్ల పేదలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పీవీ సుబ్బారావు, భారత్ గ్యాస్ నర్సయ్య పాల్గొన్నారు.

'అధిక ఫీజులు అరికట్టాలి'

వర్ని,జూన్10: వర్ని ఉమ్మడి మండలంలో గల ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల వసూళ్లను అరికట్టాలని ఏబీవీపీ వర్ని మండల శాఖ డిమాండ్ చేసింది. సోమవారం వర్ని విద్యా వనరుల కేంద్రంలో వినతిపత్రం అందజేశారు. చదువు బోధించాల్సిన విద్యా సంస్థలు నిబంధనలు తుంగలో తొక్కి యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు, స్కూల్ ఫీజుల పేరిట దోపిడికి పాల్పడుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. నియంత్రించకపోతే ఆందోళనలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంజయ్, మహేష్, విష్ణుతేజ పాల్గొన్నారు.

వేతనాలు అమలు చేయాలి

వర్ని,జూన్10: మే 1నుంచి అమలులోకి వచ్చిన బీడీ కార్మికుల వేతనాలను వెంటనే అమలు చేయాలని ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్ డిమాండ్ చేశారు. సోమవారం చందూర్ మండల కేంద్రంలో సాబ్లె వాఘూరే బీడీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్యాకర్స్, నౌకర్ స్టాఫ్, కమీషన్‌దారులకు పెరిగిన ఒప్పందాలను తెలియపరిచే కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఖిల్లా, జూన్ 10:రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన ఘటన 4వ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వినాయక్‌నగర్‌కు చెందిన ఆరెపల్లి గౌతం (42) ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొని కిందపడ్డాడు. ఈ ఘటనలో తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న నాల్గవటౌన్ పోలీసులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. సోమవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు.

రైలు నుంచి పడి ఒకరి మృతి

ఖిల్లా, జూన్ 10: కదులుతున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం సాయంత్రం సిర్నాపల్లి - ఉప్పల్‌వాయి రైల్వేస్టేషన్ మధ్యలో చోటుచేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయరెడ్డి తెలిపారు. రైల్వేస్టేషన్ మాస్టర్ సమాచారం మేరకు అటవీ ప్రాంతంలో ఉన్న రైలు ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గుర్తించినట్లు తెలిపారు. మృతుడుకి సుమారు 35 సంవత్సరాల వయస్సు ఉంటుందని అతని కుడిచేయి పైన కవిత అని పచ్చబొట్టు రాసి ఉందని తెలిపారు. మృతదేహాన్ని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంచినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712658591 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య...

మోర్తాడ్: గ్రామానికి చెందిన పాల్దా సంతోష్ (20) గూడ్స్ ట్రైన్‌కు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. ఆత్మహత్యకు వ్యక్తిగత కారణాలు ఉంటాయని అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎడపల్లిలో వ్యక్తి అదృశ్యం

ఎడపల్లి, జూన్ 10: ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన పల్లికొండ సాయిలు అదృశ్యం అయినట్లు ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన పల్లికొండ సాయిలు ఆదివారం ఉదయం ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, కుటుంబసభ్యులు తెలిసిన వారిని, బంధువులను అడిగినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం సాయిలు భార్య కల్పన ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కమ్మర్‌పల్లి మండలానికి 18వేల983పాఠ్యపుస్తకాలు

కమ్మర్‌పల్లి, జూన్10:కమ్మర్‌పల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులకు 2024-25 విద్యసంవత్సరానికి సంబంధించిన 1నుంచి 10వ తరగతి విద్యార్థులకు 18వేల 983 పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు ఎంఈవో ఆంధ్రయ్య తెలిపారు. అదే విధంగా 5నుంచి 10వ తరగతి విద్యార్థులకు 12వేల 668 పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు.

ఉర్దూ మీడియం తరగతులు అదనపు గదులలో కొనసాగిస్తాం

● కళాశాల ప్రిన్సిపల్ పాండురంగం



సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్

బాన్సువాడటౌన్, జూన్ 10: ఇంటర్మీయట్ ఉర్దూ మీడియం తరగతులను ప్రస్తుత ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గల అదనపు గదులలో కొనసాగిస్తామని , విదార్థులు , తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగం అన్నారు. సోమవారం పట్టణంలోని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంత మంది ఉర్దూ మీడియం కళాశాల ఇక్కడి నుంచి వేరే చోటుకి మారుతోందనే ప్రచారం చేస్తున్నారని , ఇలాంటి వదంతులు నమ్మవద్దన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అదనపు తరగతి గదులు ఉన్నాయని , వాటిలోనే తరగతులను నిర్వహిస్తామన్నారు. ఇంటర్మీడియట్ ఉర్దూ మీడియంలో అడ్మిషన్ తీసుకోదలచిన వారు నేరుగా కళాశాల సిబ్బందిని సంప్రదించవచ్చన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ జంగం గంగాధర్ , కళాశాల కమిటీ సభ్యులు ఏజాస్ తదితరులున్నారు.

గురుకుల డిగ్రీకళాశాలలో బీఎస్సీ ఆనర్స్ కోర్సు

సదాశివనగర్,జూన్ 10:మండలంలోని మర్కల్ వద్ద గల సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీకళాశాలలో నాలుగు సంవత్సరాల బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్సైన్స్ కోర్సు ప్రవేశపెట్టడం జరిగిందని ప్రిన్సిపల్ రాధిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్లో ఎంపీసీ గ్రూప్లో పాసైన విద్యార్థులు ఈ కోర్సులో ప్రవేశానికి అర్హులని తెలిపారు.ఈ కోర్సుకు మంచి ఆదరణ ఉంటుందని బీటెక్కు తత్సమమైనదని తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చలో హైదరాబాద్కు తరలిన సివిల్ సప్లై హమాలీలు



చలో హైదరాబాద్కు తరలివెళ్తున్న సివిల్ సప్లై హమాలీలు

బాన్సువాడటౌన్, జూన్ 10: ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బాన్సువాడ పట్టణం నుంచి సివిల్ సప్లై హమాలీలు చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్రాములు మాట్లాడుతూ హమాలీల ఎగుమతి, దిగుమతి రేట్లను పెంచాలని, సొంత గోదాములు నిర్మించాలని , పని భద్రత కల్పించాలనే డిమాండ్తో హైదరాబాద్లోని సివిల్ సప్లై భవన్ ముందు జరిగే ధర్నాకు తరలివెళ్తున్నట్లు తెలిపారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలివెళ్లిన వారిలో సాయిలు, భూమయ్య, పుట్టి సాయిలు,గంపల సాయిలు, హన్మాండ్లు,రాపర్తి సాయిలు తదితరులున్నారు.

వర్షం కోసం అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న రైతులు

మద్నూర్, జూన్ 10: వర్షాలు కురియాలని పాడి పంటలు బాగుండాలని పూజలు నిర్వహించి మం డల కేంద్రంలోని ఆలయాల వద్ద రైతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఏడాది మృగశిర కార్తె రోజు వర్షం కురిసేదని కాని ఈసారి వర్షం కురియకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం కురియగానే వ్యవసాయ పనులు ప్రారంభిస్తామని రైతులు అభిప్రాయపడుతున్నారు. అందుకు గాని ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయాల వద్ద భజన కార్యక్రమాలను నిర్వహించి ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఫర్టిలైజర్ దుకాణంలో చోరీ



మేనూర్లో దొంగతనం జరిగిన దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

మద్నూర్, జూన్ 10: మద్నూర్ మండలం మెనూర్ గ్రామంలోని కిసాన్ ఫర్టిలైజర్ దుకాణంలో చోరీ జరిగిందని బాధితుడు సంతోష్ మద్నూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు మద్నూర్ ఎస్సై ఫర్టిలైజర్ దుకాణానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు వివరాలను సేకరించడానికి క్లూస్ టీమ్ రప్పించి వివరాలను సేకరిస్తామని వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

కామారెడ్డిలో వైకుంఠధామం పరిశీలన



వైకుంఠ ధామాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్పర్సన్

కామారెడ్డిటౌన్,జూన్ 10:కామారెడ్డి పట్టణంలోని హౌసింగ్బోర్డు కాలనీలో గల వైకుంఠధామాన్ని సోమవారం మున్సిపల్ ఛైర్పర్సన్ గడ్డం ఇందుప్రియచంద్రశేఖర్రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ ద్వారా వైకుంఠధామంలో ఉన్న సమస్యలను తెలుసుకోవడంతో పాటు ఏఏ అవసరాలు ఉన్నాయనే దానిపై వివరాలు సేకరించారు. వైకుంఠ ధామంలో పిచ్చిమొక్కలను తొలగించాలని, వీధిదీపాలు, నీటి సమస్య, తొందర్లోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత,ఏఈ శంకర్, ఎస్ఐ రవీందర్, ఇంచార్జ్ ఎస్ఐ పర్వేజ్, ఎఫ్బీఓ శ్యామ్, వైకుంఠధామం కమిటీ మెంబర్ రాంచందర్రెడ్డి, రాజు, కౌన్సిలర్లు అన్వర్, పాతశివకృష్ణమూర్తి,చాట్లరాజేశ్వర్,కన్నయ్యవంశీ తదిత రులు పాల్గొన్నారు.

పశువుల అక్రమరవాణా జరగకుండా నిఘా ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డిటౌన్,జూన్ 10:పశువుల అక్రమరవాణా జరగకుండా గట్టి నిఘా ఏర్పాటుచేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులకు సూచించారు.జంతుసంక్షేమం, గోవధనిషేధ చట్టం 1977 అమలుపై పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.సంబంధిత పశువుల డాక్టర్ ధ్రువీకరణ లేనిదే ఆవులను తరలించడం నిషేధమన్నారు. పశుసంరక్షణ చట్టానికి లోబడి క్రయవిక్రయలు జరిగేలా చూడాలన్నారు. బక్రీద్ సందర్భంగా ఎక్కడపడితే అక్కడ పశువులనువధించకుండా చూడాలన్నారు. చెక్పోస్టుల నిఘాలు పెట్టాలని,రవాణాలో ఆవులను,లేగదూడలను గుర్తిస్తే మున్సిపల్ సిబ్బందికి అప్పజెప్పాలని, పశువులను అక్రమంగా తరలించే వారిపై కేసులు నమోదుచేయాలని కోరారు. పశువులను తరలించే వాహనాలలో పశువులకు సరిపడ స్థలం ఉందో లేదో గుర్తించాలని, ప్రత్యేక పర్మిట్ ఉన్న వాహనాలను మాత్రమే అనుమతించాలని తెలిపారు. రామేశ్వర్పల్లిలో ఎనిమల్ బర్త్ కంట్రోల్ ప్రారంభమైందని, కుక్కలకు కుటుంబనియంత్రణ శస్త్రచికిత్సలు చేయడం ఒక్క మున్సిపల్ శాఖపనికాదని,స్వచ్ఛంధ సంస్థలు, ప్రజలు, వ్యాపారసంస్థలు,పెంపుడు జంతువుల ప్రేమికులు శస్త్రచికిత్సలు చేయడానికి ముందుకు వచ్చి విరాళాలందించాలన్నారు. భూమిపై జీవించేహక్కు ప్రతిప్రాణికి ఉందని, స్కూళ్లలో విద్యార్థులకు జంతువులు, పశువుల మీద జాలీ,దయ, కరుణ చూపేవిధంగా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఉన్న 30 పశువైద్యకేంద్రభవనాలకు చిన్నచిన్న మరమ్మతులు ఉంటే చే పట్టి రంగులు వేయాలని,పరిసర ప్రాంతాలలో మొక్కలు నాటాల న్నారు.ఈ సమావేశంలో జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి సింహ రావు, పశువైద్య సహాయసంచాలకుడు రోహిత్రెడ్డి,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల యూనిఫాం పంపిణీ ప్రారంభం



కస్తూర్బా విద్యార్థినుల యూనిఫాంలను ప్రిన్సిపాల్కు అందజేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీలు

నాగిరెడ్డిపేట, జూన్ 10: మండల సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా శక్తి కుట్టు మిషన్ల ద్వారా ప్రభుత్వం కుట్టించిన వివిధ గ్రామాల పాఠశాల విద్యార్థుల స్కూల్ యూనిఫాం లను ఆయా పాఠశాలల ప్రధానో పాధ్యాయు లకు పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం స్థానిక ఎంపీపీ వినీత, జడ్పీటీసీ ఉమ్మన్న గారి మనోహర్రెడ్డిలు ప్రారంభించారు.స్థానిక ఐకేపీ కార్యాలయంలో యూనిఫాంల పం పిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. మండలంలో ప్రథమంగా మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినీలకు సం బంధించిన 224 యూనిఫాం దుస్తులను ఆ పాఠశాల ప్రిన్సిపాల్ వీణకు పంపిణీ చేశారు. మండలంలోని 40 ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన 3,353 మంది విద్యార్థినీ విద్యా ర్థులు న్నట్లు వీరి కోసం మొదటగా ఒక్కో విద్యార్థికి ఒక్కొక్క యూనిఫాం చొప్పున 3,352 యూనిఫాంలు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కుట్టడం పూర్తయిందని, అన్ని పాఠ శాలల ప్రధానోపాధ్యాయులకు రెండు మూడు రోజు ల్లో యూనిఫాంలన్నీ పంపిణీ చేయడం జరుగుతుందని ఐకేపీఏపీఎం జగదీష్కు మార్ తెలిపారు.ఎంపీపీ వినీతకు మండల సమాఖ్య ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పర్బన్న, ఏపీఎం జగదీష్కుమార్, మండల సమైక్య అధ్యక్షు రాలు శాంత, సీసీలుదత్తు, నారాయణ, రమేష్, శ్రీనివాస్రెడ్డి,సుజాత తదితరులు పాల్గొన్నారు.

కుళాయిల సమగ్ర సర్వేను సజావుగా చేపట్టాలి

కామారెడ్డిటౌన్,జూన్ 10:గ్రామపంచాయతీలలో కుళాయిల సమగ్ర సర్వేను పంచాయతీ కార్యదర్శులు సజావుగా చేపట్టాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్రెడ్డిఅన్నారు. సోమవారం పంచాయతీ కార్యదర్శులకు మిషన్భగీరథ నీరు అందే సమగ్ర వివరాలను సేకరించే విధానంపై శిక్షణ నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి సర్వే వివరాలు సేకరించి మొబైల్యాప్లో నిక్షిప్తం చేయాలని తెలిపారు.సమగ్రవివరాలను తర్వాత ప్రభుత్వానికి నివేదిస్తామని వెల్లడించారు. మిషన్ భగీరథ పథకంలో ఏర్పాటుచేసిన ఇంటింటా తాగునీటి పరిస్థితిపై సమగ్రసర్వే చేయనున్నట్లు తెలిపారు. ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ నీరు సక్రమంగా వస్తుందా,నల్ల కనెక్షన్ ఉందా, ఆకుటుంబానికి నీరుసరిపోతుందా, కొత్త గృహాలకు తాగునీటి సదుపాయం ఉందా లేనిది వంటి విషయాలను తెలుసుకోవడానికి ప్రభుత్వం ఇంటింటా సమగ్ర సర్వేను నిర్వహిస్తుందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను తెలుసుకునేందుకు కృషిచేయాలని కోరారు.క్షేత్రస్థాయిలో వాస్తవాలను తెలుసుకోవడానికి పంచాయతీ కార్యదర్శులు,అంగన్వాడి కార్యకర్తలు, ఐకేపీ,ఉపాధి హామీ సిబ్బందిని సర్వేలో భాగస్వామ్యం చేయనున్నట్లు తెలిపారు.నల్లాల సమాచారాన్ని ప్రత్యేకంగా భగీరథ మొబైల్ యాప్లో నమోదు చేయనున్నట్లు తెలిపారు.ఆయా గృహాలకు వెళ్లిన సిబ్బంది యాజమాని, కుటుంబ సభ్యుల వివరాలు, సెల్ఫోన్ నంబర్,ఆధార్నంబర్ నమోదు చేసుకోవాలని తెలిపారు. లబ్దిదారుడితో కలిపి ఇంటిఫోటో, కుళాయిల ఫోటోలు తీసి యాప్లో అప్లోడ్ చేయాలని సూచించారు.గ్రామాల వారిగా సేకరించిన సమాచారం మండలాలకు, ఆ తర్వాత జిల్లాకు చేరుతుం దని వెల్లడించారు. వివరాలు మొత్తం క్రోడికరించిన తర్వాత అన్ని ఇళ్లలోని కుళాయిలకు నీటి సరాఫరా ఏ విధంగా చేయాలనేది ప్రభుత్వ ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్రావు, మిషన్భగీరథ అధికారులు పాల్గొన్నారు.

ఆస్తికోసం తండ్రిని హత్య చేసిన తనయుడు



హత్యకు గురైన లాలప్ప మృతదేహం

పెద్ద కొడప్గల్, జూన్ 10: వ్యవసాయం భూమి తనకు కాకుండా తన భార్య పేరున రిజిస్ట్రేషన్ చేశాడని కారణంతో తండ్రిని కొడుకు హత్య చేసిన ఘటన ఒకటి జుక్కల్ మండలం సోఫూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనంప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి..సోఫూర్ గ్రామానికి చెందిన లాలప్పకు ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు పూనెలో ఉంటున్నాడు. రెండవ కుమారుడు సుభాష్ జుక్కల్ మండల కేంద్రంలో ఉంటూ తుపాన్ డ్రైవర్గా పనిచేస్తున్నాడు. లాలప్పకు ఇద్దకు కుమారులు ఉండగా తన కున్న 5 ఎకరాల వ్యవసాయ భూమిని 2.5 ఎకరాలు పెద్ద కుమారుడికి రిజిస్ట్రేషన్ చేశాడు. ఇక రెండో కుమారుడు సుభాష్ తన మేనత్త కూతురిని వివాహం చేసుకోగా వీరికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. చెడు వ్యవసనాలకు బానిసైన సుభాష్ తరచూ భార్యతో గొడవ పడుతుంటంతో ఆమె తన తల్లిగారింట్లోనే ఉంటుంది.సుభాష్ వాటాకు రావాల్సిన భూమిని లాలప్ప 1.5 ఎకరం కోడలు పేరున, మరో ఎకరం సుభాష్ పేరున గతంలోనే రిజిస్ట్రేషన్ చేయించాడు. దీంతో సుభాష్ తనకున్న ఎకరం పొలంలో 35 గుంటల భూ మిని అమ్మి డబ్బులను ఖర్చు చేశాడు. తిరిగి తనకు రావాల్సిన భూమిని కోడలు పేరున ఎలా రిజిస్ట్రేషన్ చేశావంటూ తరచూ తండ్రితో గొడవపడేవాడని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో సోఫూర్ గ్రామానికి వచ్చిన సుభాష్ తనను జుక్కల్లో కొంతమంది కొటారని అక్కడికి వెల్దాం అంటూ తండ్రిని తుపాన్ వాహనంలో తీసుకెల్లినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం తండ్రిని హత్య చేసి సోఫూర్ శివారులో తన పొలంలో మృతదేహాన్ని పారవేసినట్లు పోలీసులు తెలిపారు. ఉదయం లాలప్ప మృతదేహాన్ని గమనించిన గ్రామస్తులు ఈ విషయం గురించి తమకు సమాచారం అందించగా. మృతుని బంధువుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

గొట్టిముక్కులలో పూర్తయిన కల్వర్టు పనులు



రోడ్డుపై నుంచి పారుతున్న వర్షపు నీరు(ఫైల్)



నూతనంగా పూర్తి అయిన కల్వర్టు

దోమకొండ, జూన్ 10:దోమకొండ మండల కేంద్రం నుంచి గొట్టిముక్కుల, లక్ష్మీదేవునిపల్లి బిక్కనూరు వరకు వెళ్లే ప్రయాణీకులకు తిప్పలు తప్పనున్నాయి. వర్షాలు కురిసినపుడల్లా దోమకొండ- గొట్టిముక్కుల గ్రామాల మధ్యలో ఉన్న కల్వర్టు చిన్నగా ఉండటంతో కల్వర్టు నుంచి నీరు వెళ్లినా కుడా రోడ్డుపై నుంచి భారీగా నీరు ప్రవహించేది.దీంతో వాహనాదారులకు ఇబ్బందులు కలిగేవి. దానికి తోడు కల్వర్టుకు ఎడమ వైపున రోడ్డుపై గుంత ఉండేది. దీంతో ద్వీచక్ర వాహనాదారులతో పాటు ఆటోలు, ఇతర వాహనాలపై వెళ్లే వారు భయంతో వెళ్లే వారు. రాత్రి సమయంలో అటుగా ప్రయాణించడానికి బిక్కనూరు మండలం అంతంపల్లి, లక్ష్మీదేవునిపల్లి, దోమకొండ, గొట్టిముక్కుల గ్రామాలతో పాటు మాచారెడ్డి, బీబీపేట, దుబ్బాక మండలాల ప్రజలు హైదరాబాద్ వెళ్లి రావడానికి ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని రాకపోకలు సాగించేవారు. అయితే నూతనంగా నిర్మించిన కల్వర్టు పనులు పూర్తి కావడంతో మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బిక్కనూర్ టోల్గెట్ను తప్పించుకు వెళ్లే లారీలు, ఇతర వాహనాలు ఈదే దారి గుండా వెళ్తుంటాయి.

ఏసీజీఈగా బలరాం నియామకం

కామారెడ్డిటౌన్, జూన్ 10:అసిస్టెంట్ కమీషన్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్(ఏసీజీఈ)గా బలరాం నియామకం అయ్యారు.అదేవిధంగా డీసీఈబీ జిల్లా బోర్డు కార్యదర్శిగా నీలం లింగం నియామకం అయ్యారు.ఇటీవల ఈ రెండు పోస్టులకు విద్యాశాఖ దరఖాస్తులు కోరగా వీరిద్దరు ప్రధానో పాధ్యాయులు దరఖాస్తు చేసుకోవడంతో అన్ని రకాల అంశాలను పరిశీలించి విద్యాశాఖవారిని నియమించింది.

ప్రహరీ నిర్మాణ పనులలో నాణ్యత పాటించండి

పెద్ద కొడప్గల్, జూన్ 10: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న పాఠశాల ప్రహరిగోడ నిర్మాణ పనులలో నాణ్యత పాటించాలని పిఆర్ ఏఈ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న పాఠశాల ప్రహరి గోడ నిర్మాణ పనులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాల్గొన్నారు.

ఫిట్నెస్ లేని బస్సులపై స్పెషల్ డ్రైవ్ : శ్రీనివాస్రెడ్డి

కామారెడ్డిటౌన్,జూన్ 10: ఫిట్నెస్ లేని బడి బస్సులపై స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నామని జిల్లా రవాణాశాఖాధికారి శ్రీనివాస్రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోటార్ వాహనాల చట్టం 1988, కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకోచ్చిన కొత్తమోటార్ వాహనాల రూల్స్ ప్రకారం,వాహనాల రిజిస్ట్రేషన్,ఫిట్నెస్,పర్మిట్, డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్ నిబంధనల ప్రకారం లేకుండా పాఠశాలల బస్సులు రోడ్డెక్కితే అక్కడికక్కడే సీజ్చేయనున్నట్లు తెలిపారు.జిల్లాలో 232 ప్రైవేట్ బస్సులు ఉండగా ఇందులో కేవలం 101 మాత్రమే వాహన సామర్థ్య పరీక్షలు చేయించుకోవడం జరిగిందని తెలిపారు. ఇప్పటికైన పాఠశాలల యాజమాన్యం వెంటనే తమ స్కూల్ బస్సులకు ఫిట్నెస్ సర్టిఫికెట్ పొందాలని తెలిపారు. ఆటోలు, ఇతర వాహనాలపైన కూడా నిఘా ఉంటుందని తెలిపారు.

జుక్కల్ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలి

● మైనారిటీ నాయకుల డిమాండ్



మద్నూర్లో మాట్లాడుతున్న మైనారిటీలు

మద్నూర్,జూన్ 10: జుక్కల్ నియోజకవర్గం నుంచి రాష్ట్ర మంత్రి వర్గంలో ఎమ్మెల్యే లక్ష్మీకాంత రావుకు మంత్రి పదవి ఇవ్వాలని ఉమ్మడి మద్నూర్ మండలంలో మైనారిటీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ జుక్కల్ నియోజకవర్గం అన్ని రంగాలలో వెనుక బడి ఉందని వెనుకబడి ఉన్న జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధి చేయడానికి గాను వచ్చిన ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావును మంత్రి మంత్రి వర్గంలో స్థానం కల్పించి అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నట్లు వెల్లడించారు. జుక్కల్ నియోజకవర్గం ఏర్పడి ఏండ్లు గడుస్తున్న ఇంత వరకు మంత్రి పదవి దక్కలేదని అటువంటిది అభివృద్ధి వైపు చూస్తున్న ప్రజల కోసం మంత్రి పదవి ఇచ్చి అన్ని రంగాలలో అభివృద్ధి జరిగే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జావిద్ పటేల్, ఖజమియా తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ కోసం ప్రత్యేక డ్రైవ్



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ జంగం గంగాధర్

బాన్సువాడటౌన్, జూన్ 10: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య నిర్వహణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని మున్సిపల్ ఛైర్మన్ జంగం గంగాధర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రధాన రహదారిలో కొనసాగుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే వర్షాకాలంను దృష్టిలో ఉంచుకుని మురికి కాల్వలను ఎప్పటికపుడు శుభ్రం చేయిస్తామన్నారు. అదేవిధంగా అన్ని వార్డులలో కూడా పారిశుధ్య నిర్వహణ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు ఏజాస్ , నాయకులు , మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

జిల్లాలో అమ్మఆదర్శపాఠశాల పనుల కొనసాగింపు

కామారెడ్డిటౌన్,జూన్ 10:జిల్లాలోని 947 పాఠశాలల్లో అమ్మఆదర్శ పాఠశాల పనులు కొనసాగుతున్నట్లు డీఈవో రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలిపారు. ఈ పథకంలో భాగంగా ప్రతి పాఠశాలలో విద్యుత్ సౌకర్యం, మంచినీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల రిపేర్లు, మైనర్,మేజర్ రిపేర్లను యుద్ధప్రాతిపదికన చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఉన్న అన్ని పాఠశాలలకు అమ్మఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా విద్యార్థులకు కూర్చోవడానికి 28630డ్యూయల్ డెస్క్ బల్లలు,2801 గ్రీన్చాక్బోర్డుకూడా అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.విద్యార్థులకు అవసరమైన 5,51,300 పాఠ్యపుస్తకాలు, 459028 నోట్బుక్స్,ప్రాథమిక స్థాయి పాఠశాలలో విద్యార్థుల కోసం 1,19,000 వర్క్బుక్స్,10 వతరగతి విద్యార్థుల కోసం 45022 అభ్యాస దీపికలు పాఠశాల స్థాయికి పంపించడం జరిగిందని తెలిపారు.86611 మంది విద్యార్థులకు మొదటివిడుతలో భాగంగా ఒక జత ఏకరూప దుస్తులను కూడా అందించడం జరుగుతుందని తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నిజాంసాగర్, జూన్ 10: మండలంలోని గోర్గల్ గ్రామానికి చెందిన కుర్మ కృష్ణమూర్తి ఇటీవల పిడుగు పాటుతో మృతిచెందడంతో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే అనారోగ్యంతో మృతిచెందిన కుర్మ రాములు కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ సభ్యత్వం ఉండటంతో బాధిత కుటుంబ సభ్యులకు అన్ని విధాల ఆదుకుంటామన్నారు. ఈ సందర్భంగా ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట నాయకులు దుర్గారెడ్డి, మనోహర్, కళ్యాణి విఠల్ రెడ్డి, రమేష్ గౌడ్, నాయకులు తదితరులున్నారు.

నేడు రైతులకు అవగాహన కార్యక్రమం

నసురుల్లాబాద్, జూన్ 10: నసురుల్లాబాద్ మండల వ్యవసాయ అధి కారి, ఏవో నరేంద్ర ఓపత్రిక ప్రకటనలో మాట్లాడుతూ మంగళవారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలో రైతు వేదికలో ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకు, పంటల సాగు విత్తనాల పంటల ఎదుగుదల, పై పలు అంశాలపై రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలచే అవగాహన కల్పించబడుతుందని కావున రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన ఓ పత్రిక ప్రకటనలో తెలిపారు.

రెండు ట్రాన్స్ఫార్మర్ల ఆయిల్ కాపర్ చోరీ



శెట్పల్లి సంగారెడ్డిలో ధ్వంసం చేసిన ట్రాన్స్ఫార్మర్ ఇదే..

లింగంపేట,జూన్ 10: లింగంపేటమండలంలోని శెట్పల్లి సంగారెడ్డి గ్రామ శివారులోని రెండు ట్రాన్స్ఫార్మర్లను ధ్వంసం చేసి వాటిలోని ఆయిల్, కాపర్ చోరి చేసినట్లు ఏఈఈ హరీష్రావు తెలిపారు. లింగంపేట-గోపాల్పేట ప్రధాన రహదారి పక్కన వ్యవసాయ బోరుబావులకు కరంటు సప్లయి చేసేందుకు ఏర్పా టు చేసిన ట్రాన్స్ఫార్మర్లను ధ్వంసం చేశారని ఆయన తెలిపారు. చోరికి గురైన ఆయిల్, కాపర్ల విలువ రూ. లక్ష ఉంటుందని ఆయన చెప్పారు. ఆయిల్, కాపర్ల చోరి విషయాన్ని లింగంపేట పోలీసులకు పిర్యాదు చేసినట్లు ఆయన తెలియజేశారు. శెట్పల్లిసంగారెడ్డి సబ్స్టేషన్ పరిదిలోని గ్రామాలకు చెందిన రైతులు ట్రాన్స్ఫార్మర్ల వద్ద రాత్రి వేళల్లో కాపలా ఉండాలని ఆయన సూచించారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - రక్షణ
శాంతి - ఓసీ
ప్రియా 70 - మనమే
ప్రియా 35 - సత్యభామ

బాన్సువాడ

మహేశ్వరి - మనమే
వెంకటేశ్వర - గం గం గణేశా

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్స్కిన్	స్కిన్లెస్
సుగుణ (కిలో)	:	151	219	249
వెన్కాబ్(కిలో)	:	162	222	260

